
ప్రజాశక్తి
శుక్రవారం 25 ఏప్రిల్, 2025 5
శ్రీకాకుళం



సిఎం టూర్ షెడ్యూల్ ఖరారు



ప్రజాశక్తి - శ్రీకాకుళం

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటన షెడ్యూల్ ఖరారైంది. ఈనెల 26వ తేదీన ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెంలో మత్స్యకార భరోసా కింద మత్స్యకారులకు రూ.20 వేలు అందించే కార్యక్రమంలో పాల్గొంటారు. ఆరోజు 10.40 గంటలకు విజయవాడ ఎయిర్‌పోర్టులో ప్రత్యేక విమానంలో బయలుదేరి విశాఖపట్నం చేరుకుంటారు. 11.35 గంటలకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టు నుంచి హెలీకాప్టరులో బయలుదేరి 11.55 గంటలకు ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, ఉన్నతాధికారులను కలుస్తారు. మధ్యాహ్నం 12.05 గంటలకు హెలీప్యాడ్ నుంచి రోడ్డు మార్గాన 12.10 గంటలకు బుడగట్లపాలెంలో అమ్మవారి ఆలయాన్ని దర్శించుకుంటారు. 12.20 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పలువురు మత్స్యకార లబ్ధిదారులతో ముచ్చటించనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 1.45 వరకు రిజర్వు. 1.50 నుంచి 3.20 గంటలకు బుడగట్లపాలెంలోని ప్రజావేదిక వద్ద ప్రజలతో ఇంటరాక్ట్ అవుతారు. 3.25 నుంచి 4.55 గంటల వరకు సమావేశంలో పాల్గొంటారు. సాయంత్రం ఐదు గంటలకు హెలీప్యాడ్‌కు బయలుదేరి 5.25 గంటలకు హెలీకాప్టరులో విశాఖపట్నం చేరుకుంటారు. అక్కడ్నుంచి ప్రత్యేక విమానంలో తిరిగి విజయవాడ వెళ్తారు.

వక్ఫ్ భూములను కార్పొరేట్లకు అప్పగించే కుట్ర

- వక్ఫ్ చట్ట సవరణను ఉపసంహరించుకోవాలి
- ముస్లిం మైనార్టీ జెఎసి, ప్రజాసంఘాల ప్రదర్శన
- కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వక్ఫ్ బోర్డు ఆస్తులను కార్పొరేట్లకు కట్టబెట్టడానికే వక్ఫ్ బోర్డు కమిటీలోకి ముస్లిమేతరులను తీసుకొచ్చే విధానాన్ని కేంద్రంలోని బిజెపి కూటమి ప్రభుత్వం అమలు చేయనుందని ముస్లిం మైనార్టీ సంఘాల జెఎసి, ప్రజాసంఘాల నాయకులు విమర్శించారు. వక్ఫ్ చట్ట సవరణను నిరసిస్తూ శ్రీకాకుళం నగరంలో ముస్లిం మైనార్టీ సంఘాల జెఎసి, పౌర, ప్రజాసంఘాల ఆధ్వర్యాన జాతీయ జెండాను ఊరేగిస్తూ డైమండ్ పార్కు నుంచి ఏడురోడ్ల కూడలి, జిల్లాపరిషత్ మీదుగా కలెక్టరేట్ వరకు ప్రదర్శన చేపట్టారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా చిన్నారులు ఈ ప్రదర్శనలో జాతీయ జెండాలతో పాల్గొన్నారు. ప్రదర్శన అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. జమ్మూ కాశ్మీర్ లో పర్యాటకులపై ఉగ్ర దాడులను ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధార్మిక బోర్డుల్లో పర మతస్తులను నియమించే నిబంధనలు రాజ్యాంగ విరుద్ధమన్నారు. ముస్లిముల ధార్మిక సంస్థల ఆస్తుల రక్షణకు జస్టిస్ సచార్ కమిటీ అనేక ప్రతిపాదనలు చేసిందని, అందులోని ఏ ఒక్కటి కేంద్రం అమలు చేయలేదని విమర్శించారు. ముస్లిముల మనోభావాలకు వ్యతిరేకంగా ఒక పథకం ప్రకారం కేంద్ర ప్రభుత్వం మైనార్టీలకు తీరని అన్యాయం చేస్తోందన్నారు. రాజ్యాంగబద్ధంగా సంక్రమించిన వక్ఫ్ చట్టాలను సవరణ పేరుతో కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేస్తోందని చెప్పారు. ఇప్పటికే చట్టసభల్లో ఆమోదింపజేసుకుని మార్చేందుకు చేస్తున్న ప్రయత్నాన్ని తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు.



ప్రదర్శనగా వెళ్తున్న ముస్లిములు, ముస్లిం మైనార్టీ జెఎసి, ప్రజాసంఘాల నాయకులు

ముస్లిముల మేలు కోసమే వక్ఫ్ చట్ట సవరణ అని చెప్తున్న ఎన్‌డిఎ ప్రభుత్వం, వారి అణచివేతకు పరోక్షంగా ప్రయత్నిస్తోందని విమర్శించారు. రాజ్యాంగ హక్కులను కాలరాస్తే సహించేది లేదని, దేశవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఉద్యమానికి శ్రీకాకుళం నుంచే శ్రీకారం చుడతామన్నారు. ధర్నాకు సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి, కె.మోహనరావు, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు తాండ్ర ప్రకాష్, ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్, ఎఐటియుసి నాయకులు డి.గణేష్, ఎస్ఎన్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు కల్లేపల్లి రాంగోపాల్, కెఎన్‌పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మిస్క కృష్ణయ్య, గంజి ఆర్ ఎజ్రా తదితరులు సంఘీభావం తెలిపారు. ధర్నా అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ సంఘాల జెఎసి కన్వీనర్ షేక్ సలీం అమీర్, ముజీబ్, ఎం.ఎ రఫీ, మహిబుల్లాఖాన్, బహదూర్ బాషా, షేక్ నిజాముద్దీన్, రఫీ అదెని, షాన్, షైలానీ, జిలానీ, పలు మసీదుల అధ్యక్షులు, మత పెద్దలు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ముస్లిం మైనార్టీ, ప్రజాసంఘాల నాయకులు

సిఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

- 26న మత్స్యకారుల ఖాతాల్లోకి రూ.258 కోట్లు
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

ఈనెల 26న ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. బుడగట్లపాలెంలో సిఎం పర్యటనా ఏర్పాట్లను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి, ఎమ్మెల్యేలు నడుకుదిటి ఈశ్వరరావు, గొండు శంకర్‌తో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మత్స్యకార చేయూత పథకంలో భాగంగా లబ్ధిదారులకు రూ.258 కోట్ల నగదు పంపిణీ చేయనున్నారని తెలిపారు. గత ప్రభుత్వం మత్స్యకారులకు తగిన చేయూత అందించలేకపోయిందని, పార్టీ ప్రామాణికంగా మాత్రమే పథకాలను అమలు చేసిందని ఆరోపించారు. సిఎం పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

సిఎం పర్యటనలో ఎఎస్ఎల్ నిర్వహణ

మండలంలోని బుడగట్లపాలెంలో ఈనెల 26న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటనా ప్రదేశాల్లో అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ (ఎఎస్ఎల్) నిర్వహించి ముందస్తు భద్రతా ఏర్పాట్లను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, సిఎం ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ ఎఎస్‌పి ఎ.వి రమణ గురువారం పరిశీలించారు. ముఖ్యమంత్రి హెలీకాప్టర్ దిగేందుకు నిర్ణయించిన హెలీప్యాడ్ ప్రాంతాన్ని, భద్రతా ఏర్పాట్లు పరిశీలించి వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. సిఎం కాన్వాయ్‌కి సంబంధించిన రూట్ మ్యాప్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు.

హెలీప్యాడ్ నిర్మాణం చుట్టూ బారికేడ్ల ఏర్పాట్లు, సభా వేదిక భద్రతా ఏర్పాటు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించే ప్రదేశం, సభా ప్రాంగణం లోపలకి ప్రజలు, కార్యకర్తలు ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, మత్స్యకారులతో ముఖాముఖి, అమ్మవారి దేవాలయం సందర్శన తదితర ప్రదేశాల్లో పోలీస్ బందోబస్తు, భద్రత ఏర్పాట్లను సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. బారికేడ్లు పటిష్టంగా ఏర్పాటు చేయాలని, సిసి కెమెరాలు, కమాండ్ కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంగా జరగాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలన్నారు. పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు ఇప్పటికే తుదిదశకు చేరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఎస్‌పి పి.శ్రీనివాసరావు, ఆర్‌డిఒ సాయిప్రత్యూష, డిఎస్‌పిలు సిహెచ్.వివేకానంద, వి.వి అప్పారావు, శేషాద్రి, ప్రసాదరావు, పోలీసు, రెవెన్యూ, ఇంటెలిజెన్స్ విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు తదితరులు

ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రాథమిక పాఠశాలలు అభివృద్ధి చెందడం ద్వారానే ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతం అవుతుందని, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో బదిలీల చట్టంపై గురువారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ ప్రాథమిక పాఠశాల వ్యవస్థను ఫౌండేషన్ పాఠశాల, బేసిక్ ప్రాథమిక పాఠశాల, మోడల్ ప్రాథమిక పాఠశాలలుగా మార్పు చేసిందన్నారు. ఫౌండేషన్ పాఠశాలలో ఒకరకంగా, బేసిక్ ప్రాథమిక పాఠశాలలో వేర్వేరుగా ఎస్‌జిటిలను కేటాయించడం సరికాదన్నారు. ఫౌండేషన్ పాఠశాలలో 1:20 నిష్పత్తిలో ఎస్‌జిటిలను నియమించాలని కోరారు. ఉన్నత పాఠశాలలో మిగులు ఉపాధ్యాయులను ఉన్నత పాఠశాలలో సమాంతర మీడియంను అమలు చేయడం ద్వారా సర్దుబాటు చేయాలని కోరారు. యుపి స్కూళ్లలో సబ్జెక్టు ఉపాధ్యాయులను కేటాయించాలన్నారు. మోడల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో సంబంధం లేకుండా ఐదుగురు ఉపాధ్యాయులు, ఐదు తరగతి గదులు, ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. బదిలీల చట్టం రావడాన్ని స్వాగతిస్తున్నామని, పారదర్శకంగా బదిలీలు, ఉద్యోగోన్నతులు కల్పించే అవకాశముందని అన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు మాట్లాడుతూ బదిలీలు, ఉద్యోగోన్నతులు, రేషనలైజేషన్ పారదర్శకంగా ప్రభుత్వం నిర్వహించేందుకు సంఘం కృషి చేస్తుందన్నారు. ఏ ఒక్క ఉపాధ్యాయునికీ అన్యాయం జరగకుండా పిల్లలకు నాణ్యమైన విద్య అందించేవిధంగా సర్దుబాటు చేయాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిశోర్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతుల్లో రోజుకో రకమైన కసరత్తు ప్రభుత్వం చేస్తుందని, దీనివల్ల ఉపాధ్యాయుల్లో గందరగోళ పరిస్థితులు ఏర్పడుతున్నాయని అన్నారు. నిర్దిష్టమైన ప్రతిపాదనను ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయుల ముందుంచాలని సూచించారు. వారి ఆమోదంతోనే బదిలీలు చేపట్టాలన్నారు. బదిలీలలో వస్తున్న మార్పులను కార్యకర్తలు పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి ఉపాధ్యాయులకు చెప్పాలని కోరారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.బాబూరావు, బి.శ్రీరామ్మూర్తిలు మాట్లాడుతూ ఈ నెల 24 నుంచి వచ్చే నెల 30 వరకు చేపడుతున్న బదిలీలు, ఉద్యోగోన్నతులు, రేషనలైజేషన్‌కు సంబంధించి జిల్లా స్థాయిలో ఉపాధ్యాయులకు సమస్య వచ్చినా పరిష్కరించేందుకు తమవంతు సహకారం అందిస్తామన్నారు. సదస్సులో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.వైకుంఠరావు, సహాధ్యక్షులు కె.దాలయ్య, బి.ధనలక్ష్మి, కోశాధికారి రవికుమార్, జిల్లా కార్యదర్శులు టి.వి.టి.భాస్కరరావు, జి.నారాయణరావు, బి.శంకరరావు, జి.రమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు



వినతులు స్వీకరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

నీటిఎద్దడి తలెత్తకుండా చర్యలు

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

వేసవి నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి గురువారం వినతులు స్వీకరించారు. పలు గ్రామాల ప్రజలు తాగునీరు అందించాలని, విద్యా ఉపాధి అవకాశాలు కల్పించాలని వినతిపత్రాలు అందజేశారు. టెక్కలి మండలం అక్కువరానికి చెందిన విద్యార్థులు, తల్లిదండ్రులు తమ గ్రామంలోని పాఠశాల ప్రస్తుతం ఎనిమిదో తరగతి వరకు ఉందని, దాన్ని ఉన్నత పాఠశాలగా మార్చాలని లేకుంటే యథావిధిగా కొనసాగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యాశాఖ అధికారులతో మంత్రి ఫోన్‌లో మాట్లాడి పాఠశాల కొనసాగించాలని ఆదేశించారు. విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని యూనివర్సిటీ రూ.38 కోట్లతో నిర్మించిన పరిపాలనా భవనాన్ని ఈనెల 26న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెం వస్తున్న వస్తున్న నేపథ్యంలో ఆయన చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయాలని బిఆర్ఎయు విసి రజని, రిజిస్ట్రార్ పి.సుజాత తదితరులు మంత్రి అచ్చెన్నాయుడును కోరారు. సహాయ న్యాయవాదిగా నియమితులైన గొద్దు భాగ్యలక్ష్మి మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

30న టిడిపి నగర అధ్యక్ష ఎన్నిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ఎన్నికల సమయంలో టిడిపి విజయం కోసం పనిచేసిన వారికి పదవులు కట్టబెట్టేందుకు అదిష్టానం కసరత్తు చేస్తోంది. అందులో జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం నియోజక వర్గంలో సీనియర్లకు ఒక్కొక్కటిగా పదవులు కట్టబెడుతున్నారు. ఇప్పటికే కుల కార్పోరేషన్ డైరక్టర్లు, వివిధ సంస్థల కార్పోరేషన్లలో పలువురికి చోటు కల్పించారు. మరి కొందరికి పార్టీ పదవులైనా కట్టబెట్టాలన్న ఆలోచనలో ఎమ్మెల్యే గొండు శంకర్ గురువారం నగరంలోని 80 అడుగుల రోడ్డులో ఉన్న జిల్లా పార్టీ కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ప్రధానంగా నగరపాలక సంస్థ పరిధిలో ఎన్నికలు జరపకపోవడం వల్ల డివిజన్ ఇన్‌ఛార్జిలదే కీలకపాత్రగా ఉందని, అందువల్ల డివిజన్ ఇన్‌ఛార్జిల్లో చురుగ్గా వ్యవహరిస్తున్న వారికి చోటు కల్పించాలని సమావేశం నిర్ణయించారు. అలాగే సుదీర్ఘ కాలం పాటు నగర అధ్యక్ష పదవిని మాదారపు వెంకటేష్‌కే కట్టబెడుతున్నారని, ఆయన్ని మార్చాలని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అందులో భాగంగా ఈనెల 30న నగర అధ్యక్ష పదవితో పాటు డివిజన్ ఇన్‌ఛార్జిల మార్పు కోసం మరో సమావేశాన్ని ఏర్పాటు చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. అలాగే సంస్థాగతంగా శ్రీకాకుళం, గార మండల టిడిపి అధ్యక్ష స్థానాలకు ఎంపిక జరపాలని సమావేశంలో తీర్మానించారు. పార్టీ పదవులు దక్కని వారికి ప్రభుత్వం నియమిస్తున్న కమిటీల్లో చోటు ఉంటుందని చెప్పారు. ఆలయ ట్రస్టు బోర్డులతో పాటు మార్కెట్ కమిటీ, వంటి పదవుల్లో చోటు కల్పించడానికి ప్రయత్నిస్తున్నట్టు ఆయన వివరించారు. ఈ సమావేశంలో నగర టిడిపి అధ్యక్షులు మాదారపు వెంకటేష్, నగర కార్యదర్శి చిట్టి నాగభూషణం, వివిధ డివిజన్ ఇన్‌ఛార్జిలు, మండల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

భవన నిర్మాణ కార్మికులపై ప్రభుత్వ నిర్లక్ష్యం

కార్మికశాఖ కార్యాలయం వద్ద ధర్నా



ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మిక సంఘ నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో 30 లక్షల మంది ఉన్న భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు ఎం.ఆదినారాయణ మూర్తి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తంగి హరినారాయణ, ఎం.హరనాథరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు విమర్శించారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరుతూ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యాన నగరంలోని కార్మిక శాఖ ఉప కమిషనర్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ చట్టం అమలు కోసం నిర్మాణ యజమానుల నుంచి వసూలు చేస్తున్న సెస్ సుమారు రూ.4,300 కోట్లు ఉన్నా, కార్మికుల క్లయిమ్‌లను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రభుత్వ ఖజానాపై పైసా కూడా భారం లేకుండా చట్టం అమలు చేసి క్లయిమ్‌లను చెల్లించే అవకాశమున్నా, కార్మికుల సంక్షేమం పట్టించుకోవడం లేదన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి పెండింగ్ క్లయిమ్స్ పరిష్కరిస్తామని ఎన్నికల సమయంలో టిడిపి కూటమి నాయకులు హామీ ఇచ్చారని, అధికారంలోకొచ్చి పది నెలలు గడుస్తున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. కార్మికవర్గాన్ని నమ్మించి మోసగించడం సరికాదన్నారు. భవన నిర్మాణ కార్మికులకు నష్టదాయకమైన లేబర్ కోడ్లు రద్దు చేయాలని డిమాండ్ చేచేశారు. కార్మికుల సంక్షేమ పథకాల అమలు కోసం వసూలు చేసే సెస్‌ను వారి సంక్షేమానికే ఖర్చు చేయాలన్నారు.

భవన నిర్మాణ కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్ అందించాలన్నారు. కార్మికుల పని కోసం వేచి ఉండే ప్రదేశాల్లో కనీస మౌలిక సదుపాయలు కల్పించాలన్నారు. గత వైసిపి ప్రభుత్వం నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు కాకుండా తీసుకొచ్చిన మెమో 1214ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు నుంచి మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు తెలంగాణలో రూ.ఆరు లక్షలు, కర్నాటకలో రూ.10 లక్షలు చెల్లిస్తున్నారన్నారు. కేరళలో వెల్ఫేర్ బోర్డు నుంచి పెన్షన్ కోసం రూ.350 కోట్లు ఖర్చు చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ తీరు మారకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు గంజి భీమారావు, కె.భాస్కరరావు, ఎ.కామేశ్వరరావు, పనస రమేష్, పి.శ్రీను, కె.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.



అవార్డును అందుకుంటున్న ఎంపిడిఒలు వెంకటరాజు, రమేష్‌నాయుడు

ప్రగతి పాలనకు పంచాయతీలే మూలం

జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ప్రగతి పాలనకు పంచాయతీలే మూలస్తంభాలని జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పటిష్టమైన పరిపాలనా విధానం, స్థానిక ప్రభుత్వాల్లో ఉంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయన్నారు. నిరంతరం పౌర సేవలందించే ప్రజాప్రతినిధులకు అధికారులు, ఉద్యోగులకు ప్రజల్లో ఎల్లప్పుడూ గుర్తింపు, గౌరవం ఉంటాయన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థ ఏర్పడిన నాటి నుంచి ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన కోసం జిల్లా, మండల పరిషత్, గ్రామ పంచాయతీలు ఎంతగానో కృషి చేస్తున్నాయన్నారు. జెడ్‌పి చైర్‌పర్సన్ బాధ్యతలు నిర్వర్తించడంతో ఎన్నో కార్యక్రమాలు చేపట్టే అవకాశం లభించిందని చెప్పారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా స్థానిక సంస్థల ప్రతినిధులు, స్థానిక సంస్థల్లో పనిచేసే అధికారులు, ఉద్యోగులను సత్కరించడం ఆ వ్యవస్థకు ఇచ్చే గౌరవంగా భావిస్తున్నామన్నారు.

ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ తాను తొలుత ఎంపిటిసిగా, సర్పంచ్‌గా జనం నుంచి ఎన్నిక కావడం ద్వారా జనానికి అవసరమైన మౌలిక సదుపాయాలు, పౌరుల సమస్యలు తెలుసుకుంటూ పరిష్కరిస్తూ ఎమ్మెల్యే స్థాయికి చేరుకున్నానన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థ ద్వారా గ్రామీణాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. పంచాయతీరాజ్ ఉద్యమాన్ని నడిపిస్తూ వ్యవస్థను మరింత పటిష్టం చేయడంలో సర్పంచ్‌ల సంఘం కృషి ప్రశంసనీయమైందన్నారు. అనంతరం జిల్లాలోని పలువురు గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, పంచాయతీరాజ్ అధికారులు, ఉద్యోగులను జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ, ఎమ్మెల్యే గొండు శంకర్ సత్కరించి సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు. శాలిహుండం పంచాయతీ సర్పంచ్ కొంక్యాన ఆదినారాయణ, కార్యదర్శి పల్లంటి సురేష్ రూపొందించిన లోగోను జెడ్‌పి చైర్‌పర్సన్, ఎమ్మెల్యే, జెడ్‌పి సిఇఒ ఎల్.ఎన్.వి శ్రీధర్‌రాజా ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పిటిసి సభ్యుడు సురవరపు నాగేశ్వరరావుతో పాటు పలువురు సర్పంచ్‌లు, పంచాయతీరాజ్ అధికారులు, ఉద్యోగులు, జెడ్‌పి సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఎంపిడిఒలుగా రమేష్‌నాయుడు, వెంకటరాజు

వజ్రపుకొత్తూరు, లావేరు: వజ్రపుకొత్తూరు, లావేరు ఎంపిడిఒలు రమేష్‌నాయుడు, వెంకటరాజులు జిల్లా ఉత్తమ ఎంపిడిఒలుగా ఎంపికయ్యారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జెడ్‌పి చైర్‌పర్సన్, ఎమ్మెల్యేలు అవార్డులను అందజేశారు. కార్యదక్షత గల అధికారులుగా మంచిపేరు తెచ్చుకున్నారు. ఉపాధి హామీ పటిష్టంగా అమలు చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు. సచివాలయం సిబ్బంది, మండలస్థాయి అధికారులను సమన్వయం చేసుకుంటూ గ్రామస్థాయి ప్రజా ప్రతినిధులను కలుపుకుంటూ మండలాల అభివృద్ధికి పాటుపడుతున్నారు. వీరి సేవలను జిల్లా అధికారులు గుర్తించి అవార్డు ప్రదానం చేయడంపై అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు హర్షం వ్యక్తం చేశారు.



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న రవికుమార్

మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం

ప్రజాశక్తి- పొందూరు

రాష్ట్రంలో ప్రతీ గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. గురువారం మేజర్ పంచాయతీలో నూతన సచివాలయ భవనం, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి కుంటు పడిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామాల్లో రహదారులు, కాలువల నిర్మాణంతో పాటు తాగునీరు కల్పన వంటి మౌలిక వసతులకు పెద్దపీట వేసిందన్నారు. నియోజకవర్గం అభివృద్ధికి కొంతమంది మోకాలడ్డుతున్నారని, అటువంటివారిని ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో ఎంపిపి కిల్లి ఉషారాణి, సర్పంచ్ రేగడి లక్ష్మి, తహశీల్దార్ వెంకటేష్ రామానుజులు, ఎంపిడిఒ మన్మధరావు, టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్, పిఆర్ డిఇఇ చంద్రశేఖర్, ఎఇ సత్యనారాయణ, ఇఒ మోహన్‌బాబు, టిడిపి నాయకులు సీపాన శ్రీరంగనాయకులు, రాము, శంకరభాస్కరరావు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్య ప్రతినిధులు

మెహర్ విద్యా విహార్ శతశాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి- శ్రీకాకుళం

పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మెహర్ విద్యావిహార్ శతశాతం ఉత్తీర్ణత సాధించిందని హెచ్‌ఎం కామేశ్వరరావు తెలిపారు. బి.లహరి 583 మార్కులు, సంతోష్ పాడి 575 మార్కులు సాధించారన్నారు. 23 మంది విద్యార్థులకు గాను 11 మంది విద్యార్థులు 550 మార్కులకు పైబడి, ఏడుగురు విద్యార్థులు 500 మార్కులు పైబడి, నలుగురు విద్యార్థులు 450 మార్కులకు పైబడి, ఒక విద్యార్థి 350 మార్కులకు పైబడి 100 శాతం విజయం సాధించారని ఆయన తెలిపారు. విజయం సాధించిన విద్యార్థులకు హెచ్‌ఎం, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.



షోరూంను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

ఓరా మోటార్స్ షోరూం ప్రారంభం

శ్రీకాకుళం: జిల్లాలో ఓరా మోటార్స్ తన తాజా త్రీ వీలర్ షోరూంను ఏర్పాటు చేసింది. పెదపాడు పద్మావతి కళ్యాణ మండపం వద్ద ఏర్పాటు చేసిన ఈ నూతన షోరూంను పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వాసులకు అన్నిరకాల ఉత్పత్తులు అందుబాటులో ఉండేలా స్థానికంగా అమ్మకాలు జరగడం శుభ పరిణామమన్నారు. ఈ తరహా సంస్థలు జిల్లాలో మరిన్ని ఏర్పాటైతే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు స్థానిక యువతకు లభిస్తాయన్నారు. ఓరా మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ పిల్లి కృష్ణకాంత్ మాట్లాడుతూ రాష్ట్రమంతా ఓరా మోటార్స్ ను విస్తరించడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లో షోరూంలే ఏర్పాటు చేసి, అవి విజయవంతం కావడంతో శ్రీకాకుళంలో కూడా షోరూంను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. షోరూంలో ఓరా మోటార్స్ ఎఫ్ డిఎక్స్ క్లాసిక్ ప్యాసింజర్, ఎఫ్ ఎల్‌డిఎక్స్ కార్గో (లగేజ్), ఎఫ్ ఎల్‌డిఎక్స్ ప్లస్ క్లాసిక్ కార్గో (లగేజ్) వాహనాలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గోండు శంకర్, పియాజియో వెహికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ జోనల్ హెడ్ మహేష్ తివారీ, సర్వీస్ విభాగ్ హెడ్ జె.వెంకటేశ్వరరావు, ఓరా మోటార్స్ లిమిటెడ్ డైరెక్టర్ అడుసుమల్లి జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

బూర్జ: మండల కేంద్రంలో ఎంపిడిఒ, పంచాయతీ, ఇతర ప్రభుత్వ కార్యాలయాల ఎదుట పేరుకుపోయిన పారిశుధ్యాన్ని గురువారం గ్రీన్ అంబాసిడర్‌లు తొలగింపు కార్యక్రమం చేపట్టారు. ముఖ్యంగా కాలువల్లో పేరుకుపోయిన పూడికలను తొలగించారు. అనంతరం వీధిలో బ్లీచింగ్ చల్లించారు. కార్యదర్శి బి.కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బిసిసెల్ అధ్యక్షులు వేపారి వెంకటేష్, గిరి, గ్రీన్ అంబాసిడర్లు రమణ, రామారావు, ఎర్రయ్యలు పాల్గొన్నారు.



చెత్తను తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

క్రీడలను భ్రష్టు పట్టించిన వైసిపి

ఎమ్మెల్యే రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

రాష్ట్రంలో గడచిన వైసిపి పాలనలో ఆ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు క్రీడలను భ్రష్టు పట్టించారని ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో తమ్మినేని విద్యాసాగర్ ఆధ్వర్యంలో చిరంజీవి మెమోరియల్ క్రికెట్ కమిటీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కప్ జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను రవికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది వైసిపి నాయకులు తమ పుత్ర రత్నాలను రాజకీయాల్లోకి తీసుకురావాలన్న ఆకాంక్షతో అన్ని వ్యవస్థలను సర్వనాశనం చేశారని మండిపడ్డారు. మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం తన అసమర్ధుడైన కుమారుడిని జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడుగా నియమించి రూ.26 లక్షల నిధులను దుర్వినియోగం చేశారన్నారు. 2014 - 19లో జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణ అభివృద్ధికి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

ఎమ్మెల్యే రూ. 5 లక్షలు ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఈ నిధులతో తమ్మినేని విద్యాసాగర్ క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేసినప్పటికీ ఆ తరువాత కాలంలో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం పనులు చేసిన విద్యాసాగర్‌కు బిల్లును చెల్లించకుండా నిధులు స్వాహా చేశారన్నారు. పట్టణ శివారులో ఉన్న జగ్గుశాస్త్రులపేట వద్ద గత ప్రభుత్వాలు మూడు కోట్లుతో నిర్మించిన క్రీడా మైదానాన్ని కూలగొట్టి అంతర్జాతీయ క్రీడా మైదానాన్ని నిర్మిస్తామని అవగాహన రాహిత్యంతో ఆ క్రీడా మైదానాన్ని నిర్వీర్యం చేశారన్నారు. సిఎం చంద్రబాబు క్రీడాకారులకు విద్య, ఉద్యోగ అవకాశాల్లో మూడు శాతం రిజర్వేషన్లు కల్పించారన్నారు. చాలామంది తల్లిదండ్రులు విద్యపైనే దృష్టి కేంద్రీకరిస్తున్నారని తమ పిల్లలను క్రీడల్లో కూడా రాణించే విధంగా ప్రోత్సహించాలన్నారు. తనను కూడా జిల్లా క్రికెట్ అసోసియేషన్ సభ్యుడిగా అందరి ఆమోదంతో నియమించారన్నారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్‌కు పూర్వవైభవం తీసుకురాడానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. పట్టణంలో క్రికెట్ క్లబ్, స్పోర్ట్స్ క్లబ్ ఏర్పాటుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా చిరంజీవి మెమోరియల్ క్రికెట్ కమిటీకి తనవంతుగా రూ.లక్ష విరాళాన్ని ఎమ్మెల్యే ప్రకటించారు. అనంతరం క్రీడా మైదానంలో క్రికెట్‌ను ప్రారంభించి ఎమ్మెల్యే రవికుమార్ బ్యాటింగ్ చేస్తూ కొద్దిసేపు క్రీడాకారులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో క్రికెట్ అసోసియేషన్ అధికారులు, సభ్యులు, మాజీ మున్సిపల్ చైర్మన్ తమ్మినేని గీత, పేడాడ ప్రతాప్ కుమార్, నూక రాజు, బోర గోవిందరావు, సనపల ఢిల్లేశ్వరరావు, సంపదరావు మురళి, నాగళ్ల మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.



సరుబుజ్జిలి : అవార్డును అందుకుంటున్న ఈశ్వరరావు

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా మండలంలోని మూలసవళాపురం పంచాయతీ సర్పంచ్ తర్లాడ ఈశ్వరరావును ఉత్తమ సర్పంచ్‌గా ఎంపిక చేయడంపై పలువురు అభినందనలు తెలిపారు. పంచాయతీ ఏర్పడిన నాటి నుంచి సర్పంచ్‌గా బాధ్యతలు చేపడుతున్న ఆ కుటుంబానికి సరుబుజ్జిలి మండలంతో పాటు నియోజకవర్గంలో ప్రత్యేక గుర్తింపు ఉంది. సుమారు 70 ఏళ్ల వయసులో కూడా సర్పంచ్ బాధ్యతలు నిర్వహిస్తూ నిరంతరం గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్న ఈశ్వరరావుకు జిల్లా అధికారులు ఉత్తమ సర్పంచ్ అవార్డు ప్రకటించడం అభినందనీయమని ఎమ్మెల్యే కూన రవికుమార్, టిడిపి నాయకులు, మండల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు అభినందనలు తెలిపారు. అవార్డుకు ఎంపికైన ఈశ్వరరావును గురువారం జిల్లా పరిషత్ కార్యాలయంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్యే గొండు శంకర్ శాలువతో సత్కరించి మెమొంటోను అందజేశారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ గ్రామాభివృద్ధితో పాటు ప్రజల కష్టసుఖాల్లో పాల్గొనటం ద్వారా తనకు ప్రత్యేక గుర్తింపు లభించిందని ఆయన తెలిపారు.

పలువురికి ఉత్తమ అవార్డులు

రణస్థలం రూరల్: పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని తిరుపతిపాలెం సర్పంచ్ ఆకుల రవికుమార్‌కు జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్యే గొండు శంకర్ సత్కరించారు. గ్రామీణాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు చేస్తున్న కృషిలో భాగంగా జిల్లా యంత్రాంగం గుర్తించి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. పంచాయతీ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని రవి పేర్కొన్నారు.

లావేరు: పంచాయతీ దినోత్సవం సందర్భంగా గ్రామీణ నీటిసరఫరా విభాగం ఎఇ మణికంఠ, ఎంపిడిఒ కార్యాలయ టైపిస్టు పవన్‌కల్యాణ్‌లకు జెడ్‌పిలో చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్యే గొండు శంకర్ అవార్డు అందజేశారు.

కోటబొమ్మాళి: మండలంలో ఉపాధి హామీ ఎపిఒగా పనిచేస్తున్న జి.హరిప్రసాద్‌కు ఉత్తమ పురస్కారాన్ని అందుకున్నారు. ఈయన ఉద్యోగ పరంగా చేసిన సేవలకుగాను గురువారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా శ్రీకాకుళంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్యే గొండు శంకర్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. అలాగే అదే కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న విశ్వేశ్వరరావుకు, మండల పరిషత్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బోర పార్వతీశ్వరరావులు ఈ పురష్కారాలు అందుకున్నారు. వీరికి ఈ పురష్కారాలు రావడంపై ఎంపిడిఒ జయంతి ప్రసాద్, పరిపాలన అధికారి డి.మంగరాణి, డిప్యూటీ ఎండిఒ



రణస్థలం రూరల్ : ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న సర్పంచ్ రవి



కోటబొమ్మాళి : అవార్డును అందుకుంటున్న హరిప్రసాద్

జె.ఆనందరావు, ఉపాధి సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

పలాస : పలాస మండల పరిషత్ కార్యాలయం సీనియర్ సహాయకులుగా పనిచేస్తున్న కొర్ల మన్మథరావుకు ఉత్తమ ఉద్యోగిగా ఎంపికయ్యారు. జెడ్‌పిలో నిర్వహించిన పంచాయతీరాజ్ దినోత్సవంలో జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్యే గొండు శంకర్ అవార్డులు అందజేశారు. మన్మథరావుకు మండల పరిషత్ అధికారులు అనురాధ, మెట్ట వైకుంఠరావు అభినందించారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకు..!

ప్రజాశక్తి- పొందూరు



చక్రాల కుర్చీలో ఖనీజ్ ఫాతిమా

ఆత్మ విశ్వాసం తోడుగా ఉంటే ఎంతటి వికలాంగత్వమైనా జయించి తమ లక్ష్యాన్ని సాధించ వచ్చునని నిరూపించింది పొందూరు పట్టణానికి చెందిన పదోతరగతి విద్యార్థిని ఖనీజ్ ఫాతిమా కత్రి. దీర్ఘకాలిక కండరాల వ్యాధితో భాదపడుతున్న ఈ విద్యార్థిని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదవి బుధవారం విడుదలైన ఫలితాల్లో 500 మార్కులకు 479 మార్కులతో (95.8శాతం) పాఠశాలలో రెండో స్థానంలో నిలిచింది. ఈమె పుట్టుకతోనే కండరాల వ్యాధితో భాదపడుతుండడంతో కేవలం తల, చేతులు మాత్రమే కదిలించ గలదు. ఆమెకు చదువుపై ఉన్న శ్రద్ధను గుర్తించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తగిన విధంగా తర్ఫీదును అందించారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనప్పటికీ సుమారు కిలోమీటర్ దూరంలో గల పాఠశాలకు చక్రాల కుర్చిలో ప్రతీరోజు తల్లిదండ్రులు నజీర్ కత్రి, సమీర కత్రిలు తీసుకువెళ్లి వస్తుంటారు. దీర్ఘకాలిక కండరాల వ్యాధితో భాదపడుతూ పదో తరగతిలో 95.8 శాతం మార్కులను సాధించడం గొప్ప విషయమంటూ హెచ్‌ఎం పి.వెంకటరావు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థినికి అభినందనలు తెలిపారు.

నీటి తొట్టెలతో మూగజీవాలకు మేలు



తొట్టెలను పరిశీలిస్తున్న రామ్మూర్తి తదితరులు

లావేరు: వేసవిలో నీటితొట్టెలతో మూగ జీవాలకు మేలు జరుగుతుందని ఆ దిశగా ప్రభుత్వం నీటి తొట్టెలను ఏర్పాటు చేయడం ఆనందదాయకమని గుమ్మడాం పంచాయతీ టిడిపి యువ నాయకులు మజ్జి రామ్మూర్తి అన్నారు. నాగంపాలెంలో నిర్మిస్తున్న నీటి తొట్టెలను గురువారం ఉపాధి హామీ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా తొట్టెల నిర్మాణాలు వేగవంతం చేసి మూగజీవాలకు నీరు అందజేస్తామన్నారు. ఆయనతో పాటు టిఎ హైమావతి, ఫీల్డ్ అసిస్టెంట్ ఎం.రామసత్యం, జగ్గరోతు నూకరాజు, అప్పలనాయుడు, సింహాచలం, నరసింగరావు, శ్రీరాములు తదితరులున్నారు.

అభివృద్ధి పనులకు విఘాతం కలిగించవద్దు

పలాస: పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులకు ఎవరు విఘాతం కలిగించవద్దని, అలా చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు హెచ్చరించారు. మున్సిపాలిటీ పరిధిలోని మొగిలిపాడు, కెటి రోడ్డు, కాశీబుగ్గ బస్టాండు, ఓల్డ్, అన్న క్యాంటీన్ రోడ్డు, ఉదయపురం తదితర ప్రాంతాల్లో గురువారం పర్యటించారు. పారిశుధ్యం మెరుగుకు సిబ్బందికి తగు సూచనలు చేశారు. 13వ వార్డు న్యూ కాలనీలో తాగునీటి సరఫరా చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. పాత జాతీయ రోడ్డులో త్వరలో ప్రారంభించనున్న ఉద్దానం ప్రాజెక్టు తాగునీటి పథకం పైప్‌లైన్ పనులను పరిశీలించారు. అక్కుపల్లి కూడలి పెట్రోల్ బంకు ఎదురుగా ఉన్న తాత్కాలిక ఆక్రమణలను



పరిశీలిస్తున్న కమిషనర్ రామారావు

గుర్తించారు. సదరు ఆక్రమణదారులను పిలిపించి మాట్లాడారు. ఆక్రమణలను తొలగించేందుకు విముఖత చూపించడంతో ప్రొక్లెయినర్‌తో తొలగించారు. జంట పట్టణాల అభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు.

జాతీయస్థాయి సాహితీ పోటీల్లో ప్రతిభ



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల ఈ నెల 23, 24 తేదీల్లో నిర్వహించిన జాతీయ స్థాయి సాహిత్య పోటీల్లో తమిళనాడు, ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 9 కళాశాలల నుండి 350 మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభ కనపరిచారని ఐతమ్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు కళాశాల ఆవరణలో గురువారం అభినందించారు. సాహిత్య పరంగా విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీచేందుకు ఐదు విభాగాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతి, ప్రశంసాపత్రాలను అందజేశామన్నారు. ఈ పోటీలో ద్వితీయ, తృతీయ బహుమతులను ఐతమ్‌కు చెందిన ఎ.సుధారాణి, వి.హర్ష స్క్రీన్ప్లే రైటింగ్ కాంపిటేషన్‌లో కె.నిఖిల, పి.ఆర్.రోహిత్‌లు ప్రథమ, ద్వితీయ బహుమతులు గెలుపొందారని అన్నారు. డ్రామాటిక్ పెర్ఫార్మెన్స్‌లో మృదుల బృందం విజేతలుగా ఎంపికయ్యారన్నారు. అలాగే ఫిల్మ్‌వ్యూ ఛాలెంజ్లో డి.ప్రియా, కె.షర్మిల, కె.నవీన్ కుమార్, లిటరసీ క్విజ్ పి.కృపారాణి, కె.జ్ఞానేశ్వర్, పి.ప్రవీణ్‌లు విజయం సాధించారన్నారు. ఈ పోటీలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, బిఎస్ఇండ్ హెచ్ విభాగాధిపతులు డాక్టర్ రత్నమణి, డాక్టర్ ఎం.రమణయ్య, పాపినాయుడు, నడిమింటి శైలజల పర్యవేక్షణలో నిర్వహించారని తెలిపారు.

మట్టి నమూనాల సేకరణ

నందిగాం : మండలంలోని 21 రైతు సేవ కేంద్రాల నుంచి ఈ ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి మట్టి నమూనాలు సేకరించి 1541 మంది రైతుల పొలాల్లో మట్టిని సేకరించి భూసార పరీక్షలకు పంపించినట్లు ఎఒ పి.శ్రీకాంత్‌వర్మ తెలిపారు. నందిగాంలో గురువారం మట్టి నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వినియోగించడం అధిక దిగుబడులను పొందడం పెట్టుబడి ఖర్చు తగ్గుతుందని అన్నారు. రైతులందరూ భూసార పరీక్షలు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విఎఎ అరవింద్, రైతులు పి.తిరుపతిరావు, కె.ప్రభంజన్, పి.గోపి పాల్గొన్నారు.



మట్టి నమూనాలను సేకరిస్తున్న ఎఒ

విధుల్లోకి ఎర్రయ్య..

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

బూర్జ: అన్యాయంగా తొలగించారు అనేవార్త ప్రజాశక్తిలో ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. గ్రీన్ అంబాసిడర్‌గా పనిచేస్తున్న ఎర్రయ్యను అనివార్య కారణాల వల్ల నిలుపుదల చేశారు. అయితే గురువారం ఎర్రయ్యను తిరిగి విధుల్లోకి తీసుకున్నారు.



పవన్ కల్యాణ్ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న రామకృష్ణ

పల్లె పండుగలో జిల్లా ప్రథమ స్థానం

శ్రీకాకుళం: రాష్ట్రంలో నిర్వహించిన పల్లెపండుగ కార్యక్రమంలో జిల్లా ప్రథమస్థానంలో నిలిచింది. ఈ మేరకు గురువారం పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేతులమీదుగా జిల్లా పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్.రామకృష్ణ అవార్డును అందుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సిమెంట్ రోడ్లు, కాలువలు, ఇతర కాంపోనెంట్ పనులు చేపట్టి రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలిచినందుకు ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధిలో భాగస్వాములైన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డ్వామా పిడి సుధాకరరావులను ఉప ముఖ్యమంత్రి అభినందించారు.

లైసెన్స్ మంజూరుకు దరఖాస్తులు

ఆమదాలవలస: పురపాలక సంఘం పరిధిలోని భవన నిర్మాణ అనుమతుల మంజూరు లైసెన్స్‌కు టెక్నికల్ సర్వేయర్ లైసెన్స్ స్ట్రక్చరల్ ఇంజినీర్‌గా లైసెన్స్ పొందుటకు ఆసక్తి గల అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చునని ఇన్‌ఛార్జి కమిషనర్ ఎపిఎస్ జాన్సన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐటిఐ సివిల్ డిప్లమో సివిల్, బిటెక్ సివిల్ అభ్యర్థులు పురపాలక సంఘ కార్యాలయానికి నేరుగాగాని లేదా ఎపిఒ, బిపిఎస్/ ఎపి డిపిఎంఎస్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



కలశాలతో శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు

ఘనంగా జల శోభాయాత్ర

ఇచ్ఛాపురం : పట్టణంలో బెల్లుపడాలో వారం రోజులుగా శ్రీరామా తారక మహా యజ్ఞం గురువారంతో విజయవంతంగా ముగిసింది. ముగింపు సందర్భంగా యజ్ఞ మండపం నుంచి వేలాది మంది మహిళలు కలశాలతో బాహుదా నదిలో విసర్జనకు భారీ ర్యాలీతో వెళ్లారు. బెల్లుపడా, ఉప్పాడ వీధి, కార్జీ వీధి, రథంవీధి, దాసన్నపేట మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సిఐ మీసాల చిన్నంనాయుడు ఆధ్వర్యాన పట్టణ ఎస్ఐ ముకుందరావు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.



సన్మానిస్తున్న నాయకులు

'ప్రజాశక్తి' విలేకరికి సన్మానం

ప్రజాశక్తి- కవిటి

ఉభయ తెలుగు రాష్ట్రాల ఉత్తమ జర్నలిస్టు అవార్డు అందుకున్న ప్రజాశక్తి కవిటి విలేకరి పూడి సత్యనారాయణను సర్పంచ్ పూడి లక్ష్మణరావు ఆధ్వర్యాన గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పూడి లక్ష్మణరావు, నాయకులు బెందాలం రమేష్, ఆరింగి మధు మాట్లాడుతూ వృత్తిలో అంకితభావం చూపిస్తూ, వార్తల్లో వైవిధ్యం ప్రదర్శిస్తూ సత్యనారాయణ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని కొనియాడారు. ముఖ్యంగా గత నాలుగేళ్లుగా 'ప్రజాశక్తి' కథనాలతో మండలంలో ఎంతోమంది వ్యాధి గ్రస్తులకు ఆర్థికసాయం అందిందని, ఎన్నో స్థానిక సమస్యలకు పరిష్కారం లభించిందని అన్నారు. సత్యనారాయణ భవిష్యత్‌లోనూ ఇదే తరహా కొనసాగిస్తూ మరింత ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఇఒ వీరభద్రస్వామి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బెందాళం మల్లేశ్వర రావు, ఆరింగి త్రివిక్రమరావు, బెందాళం సురేష్, ప్రగడ మణిబాబు, బెందాళం చక్రధర్, బెందాళం గిరి, సమన్వయ, రవి, నూకరాజు, సుదర్శన్ పాల్గొన్నారు.

విచ్చలవిడిగా లిక్కర్ అక్రమాలు



రెడ్డి శాంతి, మాజీ ఎమ్మెల్యే

పాతపట్నం: కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రభుత్వ రంగంలో ఉన్న మద్యం దుకాణాలు మూసేసి, ప్రయివేటు వారికి కట్టబెట్టి విచ్చలవిడిగా లిక్కర్ అక్రమాలకు పాల్పడుతున్నారని వైసిపి రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఒక ప్రకటనలో ఆరోపించారు. వాటిని కప్పి పుచ్చుకోవడానికి వైసిపి నాయకులపై బురద జల్లుతున్నారని అన్నారు. వైసిపి నాయకులపై తప్పుడు కేసులు పెట్టి, ప్రజల దృష్టిని మళ్లించడానికి ప్రయత్నాలు చేస్తునే ఉన్నారని అన్నారు.

అంకితభావంతోనే వృత్తిలో సంతృప్తి



రమణమూర్తిని సత్కరిస్తున్న గ్రామస్తులు, విద్యార్థులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ఎంతో మంది విద్యార్థులను ఉన్నత స్థాయికి చేర్చడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, అందువల్లే ఉద్యోగ విరమణ చేసినా ఇతర ఉద్యోగుల కంటే ఉపాధ్యాయులు ఎంతో సంతృప్తిగా నిలవగలరని ఆర్.వి.రమణమూర్తి అన్నారు. గార మండలం సతివాడ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న ఆయన ఈనెల 30న ఉద్యోగ విరమణ చేయనున్న నేపథ్యంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమానికి పాఠశాల హెచ్‌ఎం ఎం.గౌరీ శంకర్ హాజరై మాట్లాడుతూ రమణమూర్తి నిబద్ధత గల ఉపాధ్యాయుడని, ఎందరో విద్యార్థులను ఉన్నతస్థితిలో నిలిపారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నారాయణరావు, ఎంపిటిసి పెదలాపు శ్రీరాములు, తూలుగు సర్పంచ్ కొయ్యాన నాగభూషణరావు, పాఠశాల ఉపాధ్యాయులు పి.సుధాకర్, డి.వి.ఎస్.ప్రసాద్, బి.జనార్ధనరావు, కె.శ్రీనివాసరావు, కె.నీలయ్య, సిహెచ్.లక్ష్మీరాజ్యం, ఆర్.తులసీదాస్, పి.రాములమ్మ, సిఆర్ఎంటి గోరు అప్పన్న, పి.సత్యన్నారాయణ, టి.రమామణి, గ్రామ పెద్దలు ముద్దాడ రామకృష్ణ, తాళ్ళ నాగేశ్వరరావు, పి.సుందరరావు తదితరులు పాల్గొన్నారు.



హత్య కేసు వివరాలను వెల్లడిస్తున్న సిఐ అవతారం

హత్య కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి- రణస్థలం

జె.ఆర్.పురం పోలీస్ స్టేషన్ పరిధిలోని గొల్లపేటకు చెందిన అవాల భవాని (23) ఈ నెల 19న పైడిభీమవరంలో హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ హత్యకు పాల్పడిన విజయనగరం జిల్లా, చిపురుపల్లి మండలం, పెద్దనడిపల్లి గ్రామానికి చెందిన నిందితుడు కొండక వీర్రాజ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జె.ఆర్.పురం సిఐ ఎం.అవతారం తెలిపారు. గురువారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐ మాట్లాడుతూ నిందితుడు వీర్రాజు చిన్నతనం నుంచి కుటుంబసభ్యులతో కలిసి విజయవాడలో ఉంటూ డిగ్రీవరకు చదువుకుని బెట్టింగులకు పాల్పడి అప్పుల పాలవ్వడంతో కుటుంబ సభ్యులు తన స్వగ్రామం పెద్దనడిపల్లి పంపించేశారన్నారు. పైడిభీమవరంలో ఒక హోటల్లో సర్వర్‌గా జాయిన్ అయ్యాడని, ఇదే హోటల్‌లో మృతురాలు భవాని క్లీనింగ్ పనులు చేయడానికి జాయిన్ అయిందని తెలిపారు. వీరిద్దరి మధ్య స్నేహం ఏర్పడి అక్రమ సంబంధానికి దారితీసిందని తెలిపారు. మృతురాలు ఇంట్లో ఈ విషయం తెలిస్తే గొడవలు జరుగుతాయని భయపడి వీర్రాజుని దూరం పెట్టి మాట్లాడకపోవడం, ఫోన్ చేసినా ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో భవాని వేరే వ్యక్తితో అక్రమసబంధం పెట్టుకుందేమోనని అనుమానించి ఆమెను ఎలాగైనా హత్య చేయాలని పథకం ప్రకారం ముందుగానే చాలా జారుగా ఉన్న చాకును షాపులో కొనుగోలు చేసి తనవద్ద ఉంచుకున్నాడని, భవాని హోటల్ పని ముగించుకుని రోజు వచ్చే త్రోవలో 19న సాయంత్రం 5.30 గంటలకు పైడిభీమవరం గ్రామ సమీపంలో గుర్రమ్మ గుడి వెనుక ఉన్న ఖాజావారి కోనేరు గట్టు వద్ద కాపుకాసాడు. భవాని హోటల్‌లో పని ముగించుకుని తన పెద్దమ్మ ఇంటికి వెళ్తుండగా భవానీని పిలిచి ఆమెతో కొంత సమయం గడిపి మాట్లాడుతూ అక్రమ సంబంధం కొనసాగించాలని కోరాడు. ఆమె ఎంతమాత్రం ఒప్పుకోకపోవడంతో వీర్రాజు కోపం ఆపుకోలేక తన వెంట తెచ్చిన చాకుతో భవాని మెడను బలంగా రెండుసార్లు కోయడంతో భవాని సంఘటనా స్థలంలోనే మృతి చెందింది. మృతురాలు అన్నయ్య సాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసామన్నారు. హత్యకు పాల్పడిన వీర్రాజు పరారై విజయవాడ చేరుకుని ఎవరూ గుర్తుపట్టకుండా గుండు గీయించుకుని అక్కడ నుంచి తిరుపతి చేరుకున్నాడు. వీర్రాజు కదలికలపై నిఘా పెట్టన జె.ఆర్.పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి, హెచ్‌సి కె.కె సింగ్, పిసిలు సిహెచ్ సురేష్, పి.హేమంత్ కుమార్ తిరుపతి నుంచి వచ్చిన వీర్రాజు తన స్వగ్రామం పెద్దనడిపిల్లి వెళ్లేందుకు కమ్మసిగడాం జంక్షన్ వద్ద ఉండగా ఖచ్చితమైన సమాచారంతో వెళ్లి పట్టుకుని అరెస్ట్ చేశారు. ఈ కేసుని త్వరితగతిన చేధించిన ఎస్ఐ చిరంజీవిని, సిబ్బందికి ఎస్‌పి. కె.వి మహేశ్వరరెడ్డి ప్రత్యేక అభినందనలు తెలిపారని సిఐ అవతారం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ఫల్గుణరావు (ఫైల్)

పర్లాకిమిడి: రోడ్డు ప్రమాదంలో గజపతి జిల్లా పర్లాకిమిడి సమీపంలో ఉన్న సెంచరియన్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (సియుటిఎం) అడ్మినిస్ట్రేటర్ ఫల్గుణరావు మృతి చెందారు. వ్యక్తిగత పనుల నిమిత్తం గురువారం భువనేశ్వర్ వెళ్లి తిరిగి వచ్చారు. బరంపురం నగరానికి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న పెట్రోల్ బంక్ వద్ద కార్డును డ్రైవర్ పెట్రోల్ కొట్టిస్తున్నాడు. ఈ సమయంలో ఫాల్గుణరావు వాహనం దిగి నడుచుకుంటూ వస్తున్నారు. గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఫాల్గుణరావు ప్రమాద స్థలంలోనే మృతి చెందారు. పోలీసులు శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం బరంపురం జిల్లా సమూహ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

బెల్లం ఊటలు ధ్వంసం


ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని అచ్చునాపురంలో టెక్కలి సెబీ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ షేక్ మీరా సాహెబ్ ఆధ్వర్యాన సారాతయారీ స్థావరాలపై గురువారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 700 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. అనంతరం గ్రామస్తులకు నాటుసారా తయారీ వల్ల కలిగే నష్టాలను తెలియజేశారు. కార్యక్రమంలో పొందూరు, టెక్కలి ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రచందనం తోట దగ్ధం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలంలోని శ్రీజగన్నాథపురం పంచాయతీ బిర్లంగి సమీపంలో సర్పంచ్ నూక సత్యరాజుకు చెందిన రెండు ఎకరాల సాగులో ఉన్న ఎర్రచందనం తోట గురువారం సాయంత్రం దగ్ధమైంది. ఒక్కసారిగా చందనం తోటలో నుంచి మంటలు చెలరేగడంతో స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందజేశారు. సిబ్బంది శకటంతో వచ్చే సమయానికి జరగాల్సిన నష్టం జరిగిపోయింది. చీకటి కావడంతో ఆస్తి నష్టాన్ని అంచనా వేయలేకపోయారు. సుమారుగా రూ.లక్షల్లో ఆస్తి నష్టం ఉంటుందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. అయితే ఎవరో ఆకతాయిలు చేసిన పని వల్ల తోటకు నిప్పంటించి ఉంటారని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. సంఘటన తెలిసిన వెంటనే వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ సంఘటన స్థానం చేరుకొని వివరాలను అడిగి తెలుసుకొని సర్పంచ్ సత్తిరాజుని పరామర్శించారు.



దగ్ధమవుతున్న ఎర్రచందనం తోట

పల్లెలు ప్రగతికి పట్టుకొమ్మలు


కవిటి : లక్ష్మణరావును సన్మానిస్తున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి- కవిటి

పల్లెలు ప్రగతికి పట్టు కొమ్మలని, సమితి స్థాయి నుంచి సచివాలయ వ్యవస్థ వరకూ సాగిన పంచాయతీరాజ్ వ్యవస్థ దినదిన ప్రవర్ధమానంగా వెలుగొందుతోందని ఎంపిపి కడియాల పద్మ, కవిటి సర్పంచ్ పూడి లక్ష్మణరావు, జెడ్‌పిటిసి మాజీ సభ్యుడు బెందాళం రమేష్, వరక సర్పంచ్ సావిత్రి పురియా అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిధులు లేని పంచాయతీల నుంచి నిధులు, విధులు పెరిగిన పంచాయతీల ప్రస్థానం నాయకులు గుర్తుచేశారు. అనంతరం ఎంపిపి కడియాల పద్మ, సర్పంచ్‌లు పూడి లక్ష్మణరావు, సావిత్రి పురియా, కార్యదర్శి హరికృష్ణను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి, ఇఒ వీరభద్రస్వామి, ఆరింగి మధు, ఆరింగి త్రివిక్రమరావు, బెందాళం సురేష్, బెందాళం మల్లేశ్వరరావు, శ్రీకాంత్ పురియా, ప్రగడ మణిబాబు, బెందాళం చక్రధర్, బెందాళం గిరి పాల్గొన్నారు.

కోటబొమ్మాళి : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఇఒపిఆర్‌డిలను పంచాయతీరాజ్ విభాగంలో డిప్యూటీ ఎంపిడిఒగా నియమించింది. దీంతో కోటబొమ్మాళి గ్రామ పంచాయతీ కార్యదర్శులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపిడిఒ జెన్ని ఆనందరావును గురువారం ఘనంగా సత్కరించారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయం వద్ద గాంధీజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. అనంతరం ఎంపిడిఒ పేడాడ జయంత్ ప్రసాద్ అధ్యక్షతన ఇటీవల జమ్మూ కాశ్మీర్‌లో పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి దుర్ఘటనకు నివాళ్లర్పించారు. అలాగే మండలంలో సీనియర్ సహాయకులుగా పనిచేస్తున్న పార్వతీశం, ఎపిఒకు హరిప్రసాద్, నిమ్మడ పంచాయతీ కార్యదర్శి పల్లి వెంకటేష్, ఎన్‌ఆర్‌ఇజిఎస్ కంప్యూటర్ ఆపరేటర్ కణితి విశ్వేశ్వరరావులు పంచాయతీరాజ్ దినోత్సవ పురస్కారం అందుకున్నారు.

ఇచ్ఛాపురం : మండల పరిషత్ కార్యాలయం నిర్వహించిన పంచాయతీరాజ్ దినోత్సవంలో ఎంపిడిఒ రామారావు అధ్యక్షతన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, సర్పంచ్ మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది ర్యాలీ నిర్వహించారు.

మెళియాపుట్టి : మౌలిక సదుపాయాలు కల్పనలో పూర్తిస్థాయి పారిశుధ్యం ప్రజలకు మార్గదర్శకంగా పంచాయతీలు పనిచేయాలని ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీరాజ్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాకనాపల్లి సర్పంచ్ తాడేల రామరాజు, పెద్దపద్మాపురం పంచాయతీ సర్పంచ్ మాలతి శ్రీధర్, పడ్డ సర్పంచ్ మజ్జి రామచందర్, జాడుపల్లి ఎంపిటిసి కదంబల సుజాత, పైడిరాజు, పెద్దపద్మాపురం ఎంపిటిసి ఉర్లానా హంసమ్మ రుషిలను సన్మానించారు. ఎఒ రాజేశ్వరి, సీనియర్ అసిస్టెంట్ తిరుపతి, ఎంఇఒ ఎ.పద్మనాభరావు పాల్గొన్నారు.

పలాస : మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీరాజ్ దినోత్సవాన్ని నిర్వహించారు. డిప్యూటీ ఎంపిడిఒ మెట్ట వైకుంఠరావు, చినంచల కార్యదర్శి మీనాకుమారి, బొడ్డపాడు ఎంపిటిసి మద్దిల పాపారావుకు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయికృష్ణ, ఎంఇఒలు సిహెచ్.శ్రీనివాసరావు, చెరుకుపల్లి సత్యం, ఎఒ అనురాధ పాల్గొన్నారు.

పాతపట్నం : మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన పంచాయతీరాజ్ దినోత్సవంలో ఎంపిపి దొర సావిత్రి, మండల ప్రత్యేకాధికారి మంచు కరుణాకరరావు, ఎంపిడిఒ చంద్రకుమారి, డిప్యూటీ ఎంపిడిఒ వెంకటరావు, విశ్రాంత ఎంపిడిఒలు చిరంజీవిలు పాల్గొన్నారు.

కొత్తూరు : జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ నీరజను సన్మానించారు. ఎంపిపి సవర సావిత్రి, వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు, ఎంపిటిసిలు అగముడి భైరాగినాయుడు, సారిపల్లి ప్రసాదరావు, చీకటి వీర్రాజు, టి.నాగమణి, ఇఒపిఆర్‌డి వసంతకుమారి, ఎఒ రాంబాబు పాల్గొన్నారు.

బూర్జ: పరిపాలన వికేంద్రీకరణతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయని వైస్ ఎంపిపి బుడుమూరు సూర్యారావు అన్నారు. పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఎంపిడిఒ ఆర్.తిరుపతిరావు మాట్లాడుతూ గ్రామాల్లో రక్షిత తాగునీటి సరఫరా, పారిశుధ్యం, వీధిదీపాలు, రోడ్లు, కాలువలు, పౌర సేవలు అందరికీ సమానంగా అందాలన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి రామారావు, ఇఒపిఆర్‌డి విజయలక్ష్మి, కొల్లివలస ఎంపిటిసి విక్రం పాల్గొన్నారు. అనంతరం ఎంపిటిసిలు, సర్పంచ్‌లను ఘనంగా సన్మానించారు.

శ్రీకాకుళం రూరల్: స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఎంపిడిఒ బొడ్డేపల్లి సత్యవతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


నియామకపు పత్రాలను అందజేస్తున్న చైర్‌పర్సన్ విజయ

ముగ్గురికి ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

జిల్లా పరిషత్ యాజమాన్యం పరిధిలో పనిచేస్తున్న ముగ్గురు సీనియర్ సహాయకులను అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లుగా ఉద్యోగోన్నతి కల్పించారు. సీతంపేట మండల పరిషత్ సీనియర్ సహాయకులు ఎ.లోకేశ్వరరావును రాజాం మండల పరిషత్ ఎఒగా నియమించారు. వంగర సీనియర్ సహాయకులు జి.సత్యనారాయణను జలుమూరు ఎఒగా నియమించారు. అలాగే కోటబొమ్మాళి సీనియర్ సహాయకులు బి.పార్వతీశంను నందిగాం మండల పరిషత్ ఎఒగా నియమించారు. ఈమేరకు నియామకపు ఉత్తర్వులను జెడ్‌పి చైర్ పర్సన్ పిరియా విజయ గురువారం అందజేశారు. అలాగే కవిటి మండలం మండపల్లి హైస్కూల్ ఒడియా ఉపాధ్యాయులు బంగారి గణేష్ ఇటీవల మరణించడంతో ఆయన కుమార్తె బంగారి శిరీషకు కారుణ్య నియామకం కల్పిస్తూ ఆఫీస్ సబార్డినేట్‌గా కవిటి మండలం రాజపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నియమించారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ ఎల్.ఎన్.వి.శ్రీధర్ రాజా, డిప్యూటీ సిఇఒ డి.సత్యన్నారాయణ, అధికారులు పాల్గొన్నారు.


విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న మురళీధర్

ప్రభుత్వ బడిలో చేర్పించాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలని విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ నాగళ్ల మురళీధర్ యాదవ్ కోరారు. గురువారం పట్టణంలోని మండలవీధిలో ఉపాధ్యాయులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాల పనితీరుపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. హడ్కోకాలనీలో ఉన్న పాఠశాలను మోడల్ పాఠశాలగా తీర్చిదిద్దడానికి అందరూ సహకరించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షల ఫలితాల్లో మెరుగైన మార్కులు సాధించి ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా నిలిచారన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పనస చంద్రశేఖరరావు, ఉపాధ్యాయులు కె.ధర్మారావు, అంగన్వాడీ కార్యకర్త లక్ష్మీ కారుణ్య, ధర్మారావు, మండల జగన్నాథం, మండల వెంకటరావు, యువత పాల్గొన్నారు.


మానవహారంగా విద్యార్థుల ప్రదర్శన

శర్వాణి విద్యార్థుల మానవహారం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

జమ్ముకాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు సాగించిన నరమేధంలో అసువులు బాసిన భారతీయుల కుటుంబాలకు బాసటగా నిలుస్తూ శర్వాణి విద్యాలయ విద్యార్థులు వినూత్న రీతిలో ప్రదర్శన చేపట్టారు. నగరంలోని శార్వాణి స్కూల్ నుంచి అరసవల్లి జంక్షన్ వరకు త్రివర్ణ పతాకాన్ని చేపతపట్టుకుని ప్రదర్శన చేపట్టి అనంతరం మానవహారం నిర్వహించారు. గురువారం జరిగిన ఈకార్యక్రమంలో స్కూల్ చైర్మన్ అందవరపు సూరిబాబు మాట్లాడుతూ ఉగ్రవాదులు విచక్షణ కోల్పోయి పర్యాటకులను కాల్చిచంపిన వికృత చేష్టలు భారతీయులంతా ముక్త కంఠంతో ఖండాంచాలన్నారు. మానవీయ దృక్పదాన్ని సైతం విస్మరించిన ఉగ్రవాదులపై కఠినంగా వ్యవహరించాలన్నారు. ఈ చర్య పిరికిపంద చర్యగా అభివర్ణించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎ.ఆంజనేయులు, హెచ్‌ఎం డా. కె.రేఖ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నవధాన్యాలపై అవగాహన

ప్రజాశక్తి- కొత్తూరు

స్థానిక రామాలయం ప్రాంగణంలో గురువారం డివిజన్ ఎడి రాజగోపాల్, ఎఒ స్వర్ణలత ఆధ్వర్యాన వరి పంట ఎదలో నవధాన్యాలు కిట్లను గురువారం తయారు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నవధాన్యాలు సాగు వల్ల భూమికి సారం పెరుగుతుందన్నారు. కలుపు నివారణ అవుతుందని పేర్కొన్నారు. తేమని పట్టుకొని ఉంచే గుణం ఉంటుందని పేర్కొన్నారు. చీడపీడలు రాకుండా కాపాడుతాయన్నారు. ఎదలో ఏయే సమయాల్లో వేసుకోవాలి, ఎంత మోతాదులో వేసుకోవాలో తెలియజేశారు. కార్యక్రమంలో జనార్ధనరావు, చిన్నమ్మి, దివాకర్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎడి రాజగోపాల్

ఉగ్ర దాడి హేయమైన చర్య



పలాస : కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

పలాస : జమ్ముకాశ్మీర్ పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడి హేయమైన చర్య అని వక్తలు అన్నారు. ఉగ్రదాడికి నిరసనగా పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో గ్రీన్‌ఆర్మీ ఆధ్వర్యాన రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు ఆధ్వర్యాన కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కాశీబుగ్గ గాంధీ విగ్రహం నుంచి ప్రారంభమైన ర్యాలీ శ్రీనివాస లాడ్జి కూడలి వరకు సాగింది. కార్యక్రమంలో గ్రీన్‌ఆర్మీ అధ్యక్షులు బోనెల గోపాల్, సీనియర్ నాయకులు దువ్వాడ శ్రీకాంత్, చిన్ని, మామిడి ప్రసాద్, ధర్మారావు, ఉత్తరాంధ్ర జీడి కార్మికుల నాయకులు తెప్పల అజయ్‌కుమార్, మద్దిల రామారావు, లోకనాథం, ప్రశాంత సాయి మోహనరావు, దిలీప్, పవన్ పుత్ర, ఫాల్గునరావు, చిన్నాచారి, తిరుపతి సొర్ర, ప్రసాద్, ప్రతాన్ సాయి పాల్గొన్నారు.

కవిటి: జమ్మూ కాశ్మీర్‌లోని బైసారన్ దగ్గర పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడికి కవిటి ఉషోదయ యువజన సంఘం ఆధ్వర్యాన బుధవారం రాత్రి ఘన నివాళి అర్పించారు. ఉషోదయ యువజన సంఘం సభ్యులు కొవ్వొత్తులు వెలిగించి మృతులకు అంజలి ఘటించారు. కార్యక్రమంలో ఉషోదయ యువజన సంఘం అధ్యక్షుడు ఆరింగి కృష్ణారావు, సభ్యులు ఆరింగి మధు, పాండవ చంద్రశేఖర్, ఆరింగి త్రివిక్రమరావు, బెందాళం చక్రధర్, పొల్లాయి మోరేసు రుద్రయ్య, మొర్రి ఆదినారాయణ, బెందాళం సురేష్, తెప్పల మోహనరావు, పొల్లాయి ఉమాపతి, పొల్లాయి అశోక్, ప్రగడ మణిబాబు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: పహల్గాంలో ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ... ఈ దృశ్చర్యలో మృతి చెందిన వారికి సంతాప సూచకంగా జనసేన నాయకులు పార్టీ కార్యాలయంలో మౌన దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో యాదవ సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్, నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు, రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ తిప్పన దుర్యోధనరెడ్డి పాల్గొన్నారు.

స్థానిక శాంతి నికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో జమ్మూ కాశ్మీర్ పహల్గాన్ లో జరిగిన ఉగ్రవాదుల దాడిలో కానిపోయిన పర్యాటకులకు స్కూల్ చైర్మన్ దక్కత కృష్ణమూర్తిరెడ్డి, స్కూల్ ఉపాధ్యాయులు ఘనంగ నివాళ్లర్పించి రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. కార్యక్రమంలో స్కూల్ మేనేజర్ కె.సి.పూరి, ఉపాధ్యాయులు సురేఖ, పద్మజ, శంకర్, శ్రీధర్, రవి, రోజా, యశోద, శాంతి, స్నేహ, జయలక్ష్మి, మీనా, పార్వతి, ప్రమీల, సరోజ పాల్గొన్నారు.

పాతపట్నం: జమ్మూ కాశ్మీర్ పహల్గంలో ఉగ్రవాదులు జరిపిన దాడిని ఖండిస్తూ ఎబివిపి ఆధ్వర్యాన ఆల్ ఆంధ్రా రోడ్‌లో ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం చేశారు.

శ్రీకాకుళం లీగల్ : ఉగ్రవాదులు దాడులు వ్యతిరేకంగా న్యాయవాదులు నగరంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ గేదెల వాసుదేవరావు, న్యాయవాదులు కూన అన్నంనాయుడు, ఎన్ని సూర్యారావు, బగాది అప్పలనాయుడు, సూర వేణుగోపాలరావు, డి.ఈశ్వరరావు, పిట్ట దామోదరరావు పాల్గొన్నారు.

రణస్థలం రూరల్: ఉగ్రదాడులను ఖండిస్తూ... మండల కేంద్రంలో జామియా మసీద్ నుంచి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

సోంపేట : ఉగ్రవాదుల దాడిలో మృతికి నివాళ్లర్పిస్తూ... స్థానిక శ్రీనివాస్ థియేటర్ నుంచి గాంధీ మండపం వరకూ స్థానికులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీన ప్రదీప్, సునీల్, జోగారావు, డాక్టర్ లక్ష్మీనారాయణ, షణ్ముఖ, గార రాజేష్, మల్లా నాగేంద్ర, చిత్రాడ శ్రీను, శేఖర్ పాల్గొన్నారు.

శ్రీకాకుళం : మత చాందసులుగా మారి ఉగ్రవాదులు విచక్షనా రహితంగా పర్యాటకులపై కాల్పులు జరిపి హత్య చేయడం హేయమైన చర్యని జనసేన జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్ అన్నారు. గురువారం నగరంలోని జ్యోతిరావు పూలే పార్కు వద్ద పార్టీ ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సర్వేశ్వరావు, కె.సంతోష్, రూరల్ మండల అధ్యక్షులు దాటిరాజుల కుర్మారావు, జిల్లా కార్యదర్శి బమ్మిడి సిద్దయ్య, బొట్టా శంకర్ యాదవ్, బి.సుశీల, కె.వరప్రసాద్, చిట్టి భాస్కర్, దాసరి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.


సాయి స్వరాజ్ సిద్ధును అభినందిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

టెన్త్ విద్యార్థులకు సన్మానం

ప్రజాశక్తి- ఆమదాలవలస

రాష్ట్రంలో బుధవారం విడుదలైన పదో తరగతి ఫలితాల్లో నియోజకవర్గంలో అత్యధిక మార్కులు సాధించిన కె.సాయి స్వరాజ్ సిద్ధుకు గురువారం ఎమ్మెల్యే కూన రవికుమార్ సన్మానించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో మండలం, మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. నియోజకవర్గంలో అత్యధికంగా 594 మార్కులు సాధించిన ఎస్‌విఎస్ పాఠశాల విద్యార్థి సాయి సిద్ధుకు విశాఖపట్నం స్పేస్ అకాడమి రూ.2 లక్షల 50 వేలు ఫీజును రద్దు చేస్తూ ఇంటర్మీడియట్ సీటు ఉచితంగా ఇస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు రాణించాలని ఉపాధ్యాయులు అందుకు తగ్గట్టుగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌విఎస్ పాఠశాల కరస్పాండెంట్ పేడాడ ప్రతాప్, తమ్మినేని విద్యాసాగర్, మండల విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థి సిహెచ్ యామిని 600 మార్కులకు 586 మార్కులు సాధించడంతో ఎమ్మెల్యే అభినందించారు. గాజుల కొల్లివలసకు చెందిన ఈమె తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. కష్టపడి చదివి ఆ గ్రామానికి, పాఠశాలకు రోల్ మోడల్‌గా నిలిచిందని ఆమె ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని హెచ్‌ఎం ఎమ్మెల్యే చేతులమీదుగా రూ.5 వేలు నగదు పారితోషకాన్ని అందించారు.

అదే పాఠశాలలో 550 మార్కులు దాటిన మరో ఇద్దరు విద్యార్థులకు రూ.3 వేలు చొప్పున పాఠశాల ప్రారంభం రోజు తల్లిదండ్రుల కమిటీలో ఇవ్వనున్నట్లు తెలిపారు. మరో 10 మంది విద్యార్థులు 500 మార్కులకు పైగా సాధించారు. ఎస్‌సి, బీసి హాస్టల్ విద్యార్థులు పదో తరగతిలో 100 శాతం ఉత్తీర్ణులైనట్లు హెచ్‌ఎం తెలిపారు. అలాగే మండలంలోని గాజుల కొల్లివలస వద్ద నున్న శ్రీవాణి విద్యానికేతన్ విద్యార్థిని కిల్లి నిహారిక పదో తరగతిలో 600 మార్కులకు 588 మార్కులు సాధించినందుకు ఎమ్మెల్యే సత్కరించి అభినందించారు. ఆమె తల్లిదండ్రులకు శాలువతో సత్కరించి మెమెంటో అందజేశారు.

విలువలతో కూడిన విద్య అవసరం


దుదిష్టిని సన్మానిస్తున్న విప్ అశోక్

ప్రజాశక్తి- కవిటి

సమాజంలో విలువలతో కూడిన విద్య అవసరమని, ప్రాథమిక పాఠశాలలు పట్టుకొమ్మలుగా నిలవాలని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. కవిటి కళ్యాణి ఆంగ్ల పాఠశాల 15వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి లోల్ల రాజేష్ అధ్యక్షతలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాట్లాడారు. ప్రస్తుతం సమాజంలో విపరీత పోకడలు నియంత్రించాలంటే ప్రతిఒక్కరూ వ్యక్తిగత బాధ్యత తీసుకోవాలన్నారు. అలా తీసుకున్నప్పుడే జవాబుదారీతనం పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా బాడీ బిల్డింగ్ పోటీల్లో రాష్ట్రస్థాయిలో సత్తాచాటుతున్న దుదిష్టి మజ్జిని ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన మార్చ్ ఫాస్ట్, పిరమిడ్ విన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. కార్యక్రమంలో సర్పంచ్ పూడి లక్ష్మణరావు, ఉషోదయ యువజన సంఘం అధ్యక్షుడు ఆరింగి కృష్ణారావు, ఎంఇఒ ధనుంజయ మజ్జి, విశ్రాంత అధ్యాపకుడు ప్రగడ వెంకటరమణ, జెడ్‌పిటిసి మాజీ సభ్యుడు బెందాళం రమేష్, మాజీ సర్పంచ్‌లు, ప్రధానోపాధ్యాయుడు బెందాళం మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షునిగా సంజీవరావు



ఎన్నికైన నూతన కార్యవర్గం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న వార్డు సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న వివిధ విభాగాల ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. నగరంలోని రెవెన్యూ అతిథిగృహ సమావేశ మందిరంలో వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇప్పిలివీధి సచివాలయంలో అడ్మిన్ సెక్రటరీగా ఉన్న అల్తి సంజీవరావు అధ్యక్షునిగా, గొంటి వీధి డేటా ఎంట్రీ సెక్రటరీ కైబాడీ రామారావు ప్రధాన కార్యదర్శిగా, బోడిశెట్టి సాయికుమార్ కోశాధికారిగా, హడ్కోకాలనీ వార్డు ప్లానింగ్ సెక్రటరీ పంగా వెంకటరమణ అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా పి.రామినాయుడు, వేణుగోపాలరెడ్డి, డి.భాగ్యలక్ష్మి, టి.త్రివేణి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎ.చిన్నమ్ముడు, జాయింట్ సెక్రటరీలుగా పి.ధనంజయరావు, కె.హర్షకిరణ్, పి. వెంకటరావు, కె.కిషోర్‌కుమార్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ విభాగానికి ఎ.కిరణ్‌కుమార్, కార్యవర్గ సభ్యులుగా సరిత, జి.పద్మ, ఇప్పిలి సన్యాసిరావు, టి.మౌనిక ఎన్నికయ్యారు.

పాడి రైతులకు అవగాహన కరువు

● కానరాని వైద్య సేవలు ● పట్టించుకోని అధికారులు


పశువైద్య కేంద్రం

ప్రజాశక్తి- బూర్జ

ఏప్రిల్ మే నెలలో ఎండలు విపరీతంగా ఉన్న సమయంలో మూగజీవాలకు పలు వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంది. ముఖ్యంగా మూగజీవాలు వడదెబ్బకు గురవ్వడంతో మృత్యువాత పడే అవకాశం ఎక్కువగా ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. పాడి రైతులకు అవగాహన కల్పించాల్సిన పశు వైద్యశాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో తీవ్ర నష్టాలు చవి చూసే పరిస్థితులు ఉన్నాయని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వేసవి కాలంలో మూగజీవాలకు ఏ విధమైన సదుపాయాలు కల్పించాలో తమకు అవగాహన లేకపోవడంతో పలు అవస్థలు ఎదుర్కొంటున్నామని మండలంలోని రైతులు చెబుతున్నారు.

అందుబాటులో లేని వైద్యులు..

మూగజీవాలకు సంక్రమించిన వ్యాధులకు చికిత్స కోసం మండల కేంద్రంలోని పశు వైద్య కేంద్రాలకు తీసుకువెళ్తే అక్కడ వైద్యులు అందుబాటులో ఉండడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ముఖ్యంగా వేలాది రూపాయలు ఖర్చు చేసి కొనుగోలు చేసిన తమ పాడి పశువులకు భీమా సౌకర్యం కూడా వర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారుల స్పందించి పాడిపశువులకు తక్షణ వైద్య సహాయం అందించేలా చర్యలు తీసుకోవాలని మండలంలోని పాడి రైతులు కోరుతున్నారు.

పొంతన లేని సమాధానాలు...

ఇదే విషయాన్ని పశుసంవర్ధక శాఖ జెడి వేణుగోపాల్‌ను వివరణ కోరగా గత రెండు రోజులుగా వైద్యాధికారిణి సెలవులో ఉన్నారని బుధవారం వివరణ ఇచ్చారు. ఇదే విషయాన్ని గురువారం స్థానిక వైద్యాధికారిణి జోత్స్నను వివరణ కోరగా తాను సెలవు పెట్టలేదని, మంగళ, బుధవారాలు పశువైద్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్నానని పొంతనలేని సమాధానం ఇచ్చారు. మరోవైపు రైతులు తమకు వైద్యులతో పాటు సిబ్బంది అందుబాటులో ఉండడం లేదని ఆరోపిస్తున్నారు. ఇదే విషయాన్ని ఎడి సుబ్రమణ్యంను వివరణ కోరగా వీటిపై సమగ్ర దర్యాప్తు జరిపి సక్రమంగా వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వితంతు పింఛన్ల మంజూరుకు జిఒ విడుదల

కోటబొమ్మాళి : జిల్లాలో 4623 మంది వితంతువులకు నిధులు అందజేయనున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణికి 89,778 మంది వితంతువులు పింఛన్లకు దూరమయ్యారని అన్నారు. తాను గ్రామాల్లో పర్యటించినప్పుడు వితంతువుల సమస్యలను తన దృష్టికి తీసుకొచ్చారని అన్నారు. దీనిపై కేబినెట్లో చర్చించి ప్రత్యేకంగా జిఒను విడుదల చేయించానని తెలిపారు.


ఆర్థికసాయం అందజేస్తున్న క్లబ్ సభ్యులు

క్రీడాకారులకు ఆర్థికసాయం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఈ నెల 26 నుంచి 28 వరకు జార్ఖండ్ రాజధాని రాంచి జైపాల్ సింగ్ స్టేడియంలో నిర్వహించనున్న జాతీయ క్రీడా పోటీలకు కెజిబివి విద్యార్థులు జి.అంజిలి, పి.హైమా గురువారం పయనమయ్యారు. వీరికి ఖర్చుల నిమిత్తం స్థానిక అలయన్స్ క్లబ్ సభ్యులు రూ.ఆరు వేలు అందించారు. క్లబ్ సభ్యులు బత్తుల వెంకటరమణ మాట్లాడుతూ క్రీడాకారులను ఈ విధంగా ప్రోత్సహిస్తూ... వారిలో ఆత్మస్థర్యాన్ని నింపాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో కెజిబివి ప్రిన్సిపాల్ పొన్నాడ శిరీష, పిఇటి భారతి, ఆలయన్స్ క్లబ్ పిఆర్ఒ దక్కత గోపీనాథ్‌రెడ్డి, సభ్యులు రామకృష్ణ, బుజ్జి, బత్తుల రామారావు పాల్గొన్నారు.

రాజీ మార్గం వైపు దృష్టి పెట్టాలి

టెక్కలి : మే 10న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో అధిక శాతంలో కేసులు పరిష్కారమయ్యేలా దృష్టి పెట్టాలని టెక్కలి సీనియర్ సివిల్ జడ్జి బి.నిర్మల కోరారు. కోర్టు ఆవరణలో న్యాయవాదులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజీకి అనుకూలమైన కేసులను పరిశీలించి వాటిని పరిష్కరించేందుకు న్యాయవాదులు, పోలీసులు, సమన్వయంతో కృషి చేసి కక్షిదారులతో ఆవగాహన కల్పించి కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జూనియర్ సివిల్ జడ్జి ఎస్.హెచ్.ఆర్.తేజచక్రవర్తి మల్లా, బార్ అసోసియేషన్ అధ్యక్షులు పినకాన అజయ్‌కుమార్, ఎపిపి కె.సుధారాణి, న్యాయవాదులు దివ్వల వివేకానంద, పేడాడ బాబూరావు, వైకుంఠరావు పాణిగ్రాహి, పైల చంద్రుడు, సాయిరాజ్, ధర్మారావు పాల్గొన్నారు. ముందుగా మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు సివిల్ జడ్జిగా బి.నిర్మల బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. కొంతకాలంగా ఖాళీగా ఉన్న జడ్జి స్థానాన్ని భర్తీ చేశారు. ఈ మేరకు బారక్ష అసోసియేషన్ అధ్యక్షులు ఆధ్వర్యాన న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్ఛాన్ని అందజేసి స్వాగతం పలికారు.


రికార్డులను పరిశీలిస్తున్న కూర్మారావు

అంతర్గత ఆడిట్‌తో ప్రయోజనాలు

ప్రజాశక్తి- మందస

ప్రతి స్వయం శక్తి సంఘ సభ్యులు అంతర్గత ఆడిట్ చేయించుకోవడంతో అధిక ప్రయోజనం ఉంటుందని ఐటిడిఎ వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. స్థానిక మండల సమాఖ్య సమావేశ మందిరంలో గ్రామ సంఘాల పుస్తకాలను గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం అన్ని మహిళా సంఘాల్లోనూ ఎక్కువ మొత్తంలో లావాదేవీలు జరుగుతున్నాయని అన్నారు. దీనివల్ల నిధుల దుర్వినియోగం, అవకతవకలు జరగకుండా సభ్యులందరికీ పారదర్శకంతో జవాబుదారీగా ఉండే ఉద్దేశంతో ప్రభుత్వం కమ్యూనిటీ ఆడిట్ వ్యూహాన్ని అమలు చేస్తుందన్నారు. సభ్యులకు ఆర్థిక అక్షరాస్యత గురించి అవగాహన కల్పించుకోవాలన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ కో-ఆర్డినేటర్ తారక మోహన్, ఎఇఒలు పాల్గొన్నారు.

డిఎస్‌సి అభ్యర్థులకు ఉచిత శిక్షణ

పాతపట్నం : ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన డిఎస్‌సి నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ మేరకు స్థానిక మహేంద్ర జూనియర్ కళాశాలలో మామిడి అప్పారావు ఛారిటబుల్ ట్రస్టు తరుపున ఎమ్మెల్యే మామిడి గోవిందరావు గురువారం శిక్షణా తరగతులను ప్రారంభించారు. 40 రోజుల పాటు సాగే కోచింగ్‌లో భాగంగా మొదటి రోజు స్టేట్ ఫ్యాకల్టీ జి.సింహాచలం నాయుడు జికె, కరెంట్ అఫైర్స్ సబ్జెక్టులను బోధించారు. డిఎస్‌సి అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు.


సన్మానిస్తున్న వైసిపి నాయకులు

మాజీ స్పీకర్‌కు సన్మానం

కొత్తూరు : మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం వైసిపి అడ్వైజర్ మెంబరుగా నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం ఆమదాలవలసలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణ, వైసిపి మండల అధ్యక్షులు గండివలస ఆనందరావులు మర్యాదపూర్వంగా కలిశారు. అనంతరం పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువ కప్పి సన్మానించారు. వీరితో పాటు వైసిపి రైతు విభాగం అధ్యక్షులు ఎన్.కృష్ణమూర్తి, ఎంపిటిసి వి.లక్ష్మీనారాయణ, నర్సిరెడ్డి, వర్షిలింగం ఉన్నారు.

సత్తాచాటిన మోడల్‌స్కూల్ విద్యార్థులు


వినీష

పొందూరు: మండలం లోని వావిల పల్లిపేట వద్ద గల ఎపి మోడల్‌స్కూల్ విద్యార్థులు పదోతరగతి ఫలితాల్లో తమ సత్తా చాటారు. పాఠశాలలో 90 మంది విద్యార్థులకు 83 మంది విద్యార్థులు పాసై 92శాతం ఫలితాలను సాధించారు. ఇందులో ఎం.వినీష 585 మార్కులు, ఎం.వంశీకృష్ణ 569 మార్కులు. పి.హేమాంజలి 566 మార్కులు సాధించారు. మండలంలో పదో తరగతిలో అత్యధిక శాతం ఫలితాలను సాధించిన పాఠశాలగా గుర్తింపు పొందింది. అలాగే మండలంలో రాపాక జెడ్‌పిహెచ్‌ఎస్ పాఠశాల అత్యల్ప ఫలితాలను సాధించిన పాఠశాలగా నిలిచింది. పాఠశాలలో 31 మంది విద్యార్థులకు 13 మంది పాసై 42 శాతం ఫలితాలను సాధించింది.